

నేడు బళ్లారికి ముఖ్యమంత్రి రాక

బళ్లారి సిటీ, జూన్ 19: ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం బళ్లారికి రానున్నారు. సాయంత్రం బెంగళూరు నుంచి జిందాల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం 6గంటలకు జిందాల్ టౌన్‌షిప్‌లో జరిగే 2024 'యోగా రత్న' అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొని రాత్రికి అక్కడే బసచేస్తారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 7గంటలకు జిందాల్ టౌన్‌షిప్‌లో జరిగే ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొంటారు. అనంతరం హొసపేట డీసీ హాల్లో విజయనగరం జిల్లా ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు జిందాల్‌కు చేరుకుని బెంగళూరుకు బయలుదేరి వెళతారు.

డీకే శివకుమార్ కొత్త ఎత్తుగడ..!

- చెన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా పోటీకి సై
- అధిష్టానం ఆదేశిస్తే సిద్ధం
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటన



బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనానికి తెర లేపుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు గ్రామీణ నుంచి తమ్ముడు డీకే సురేశ్ చిత్తుగా ఓడిపోవడంతో డీకే శివకుమార్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఫలితాల తర్వాత బుధవారం తొలిసారి చెన్నపట్టణ నియోజకవర్గంలో పర్యటించారు. అంతకుముందు బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో చెన్నపట్టణ ప్రజలు తనపట్ల ఆసక్తి చూపి పార్టీ నిర్ణయం తీసుకుంటే తానే పోటీ చేస్తానని పేర్కొన్నారు. చెన్నపట్టణ తన హృదయం లాంటిదని, గతంలో సాతనూరు శాసనసభ పరిధిలో ఉండేదని, తనకు రాజకీయ జన్మనిచ్చిన స్థలమని అన్నారు. కష్టకాలంలో చెన్నపట్టణ ప్రజలు ఎంతో మద్దతు ఇచ్చారని తెలిపారు. కనకపురను ఏ విధంగా అభివృద్ధి చేశానో అదే విధంగా చెన్నపట్టణను తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆలయాలను సందర్శించి ప్రజలతో చర్చిస్తానని అన్నారు. చెన్నపట్టణ నుంచి తన తమ్ముడు సురేశ్ పోటీ చేసే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. తనకు ఓట్లు వేసి మద్దతు ఇవ్వాలని అక్కడి ప్రజలను కోరుకుంటానని అన్నారు.

మరో ఎత్తుగడకు సిద్ధమయ్యారా..?

కనకపుర ఎమ్మెల్యేగా కొనసాగుతూ ఉపముఖ్యమంత్రిగా, జలవనరులశాఖ మంత్రిగా, కేపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న డీకే శివకుమార్ కొత్త ఎత్తుగడకు సిద్ధమయ్యారు. 2023లో చెన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా జేడీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి గెలుపొందారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు మారిన రాజకీయ సమీకరణలతో బీజేపీ-జేడీఎస్ పొత్తు పెట్టుకున్నాయి. మండ్య నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన కుమారస్వామి భారీ మెజారిటీతో విజయం సాధించారు. కేంద్రంలో కీలకమైన భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖమంత్రిగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో కొనసాగుతున్నారు. కేంద్రమంత్రి కావడంతో కుమారస్వామి మూడు రోజుల క్రితం చెన్నపట్టణ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఇదే స్థానం నుంచి కుమారుడు నిఖిల్‌ను పోటీ చేయించాలని కుమారస్వామి నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అందుకు బీజేపీ కూడా సానుకూలంగానే ఉంది. రాజకీయంగా కోలుకోలేని దెబ్బతీసిన కుమారస్వామిని ఢీ కొట్టేందుకు డీకే శివకుమార్ సిద్ధమయ్యారు. బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నుంచి రెండుసార్లు తిరుగులేని స్థాయిలో విజయం సాధించిన డీకే సురేశ్‌కు ప్రత్యర్థిగా దేవెగౌడ అల్లుడు, కుమారస్వామి బావ, జయదేవ ఆసుపత్రుల మాజీ డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బీజేపీలో చేర్పించి పోటీ చేయించారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని డాక్టర్‌ను పోటీ చేయించడం ద్వారా డీకే సురేశ్‌ను ఏకంగా 2.69 లక్షల ఓట్లతేడాతో ఓడించారు. ఇది డీకే శివకుమార్ ప్రతిష్ఠకు తీరని భంగం కలిగింది. ఎన్నికల్లో పనిచేయని ఇన్‌చార్జ్ మంత్రులు రాజీనామా చేయాల్సిందేనని ఎన్నికలకు ముందు తేల్చి చెప్పిన డీకే శివకుమార్ ఫలితాల తర్వాత పార్టీ అధ్యక్షుడి స్థానంలో ప్రతిపాదించలేకపోయారు. పరోక్షంగా పార్టీలోనే డీసీఎం హోదాలో ఉంటూ తమ్ముడిని గెలిపించుకోలేకపోయారనే విమర్శలను ఎదుర్కొన్నారు. ఎక్కడ ఓడిపోయామో అక్కడే గెలవాలని డీకే శివకుమార్ సవాల్‌గా తీసుకున్నారు. చెన్నపట్టణ నుంచి పోటీ చేయడం ద్వారా కుమారస్వామికి తానే రంగంలో దిగానని చాలెంజ్ చేయడంతోపాటు కుమారస్వామి వారసుడు నిఖిల్ పోటీ చేస్తే ఓడించాలని వ్యూహంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. చెన్నపట్టణలో పోటీ చేసి అక్కడ విజయం సాధిస్తే కనకపురను తమ్ముడు డీకే శివకుమార్‌కు అప్పగించాలనేది ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. మరో నాలుగేళ్లు శాసనసభ ఎన్నికలు, ఐదేళ్లు లోక్‌సభ ఎన్నికలు లేనందున ఉపసమరం ద్వారా తమ్ముడిని రాజకీయాల్లో క్రియాశీలకం చేసేందుకు ఎత్తుగడ వేసినట్టు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యేగా ఉంటూ మరోచోటు పోటీ చేసేందుకు అధిష్టానం అంగీకరిస్తుందా..? లేదా ఎటువంటి మలుపులు తిరుగుతాయనేది వేచిచూడాల్సి ఉంది.





ఒకేరోజు 600 కేసుల పరిష్కారం



- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగప్రసన్న రికార్డు

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న కేసుల పరిష్కారంలో మరో రికార్డు సృష్టించారు. మంగళవారం ఒకేరోజు 608 పిటిషన్‌లతోపాటు కేసులకు పరిష్కారం చూపారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపినట్టయింది. వీటిలో పలు కేసులకు మధ్యంతర ఆదేశాలు జారీ చేయడంతోపాటు కొన్నింటికి తుదితీర్పులు ప్రకటించారు. జస్టిస్ నాగప్రసన్న 2023 జూలై 12న 522 కేసులను పరిష్కరించి రికార్డు నమోదు చేశారు. ప్రస్తుతం అటువంటి రికార్డు కొనసాగించారు. 2023 డిసెంబరు 20న ఒకేరోజు 50 తీర్పులను ప్రకటించారు. కొన్ని నెలల క్రితం 480కేసులకు జాబితా సిద్ధం చేసి వాటన్నింటికి విచారణ జరిపారు. ప్రస్తుతం క్రిమినల్ కేసుల రద్దు కోరుతూ దాఖలైన పిటిషన్‌లతోపాటు పలు అర్జీలకు ఒకేరోజు పరిష్కారం చూపారు. 2019 నవంబరు 26న న్యాయమూర్తి ఎం. నాగప్రసన్న హైకోర్టు అదనపున్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 సెప్టెంబరు 8 నుంచి రెగ్యులర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.



ప్రతిభ పురస్కారాలు పొందిన విద్యార్థులతో ముఖ్యమంత్రి, సభాపతి తదితరులు

కులవ్యవస్థతోనే అసమానతలు

- విద్యావంతుల్లోనూ పెరుగుతున్న కుల ప్రాధాన్యం
- మూఢ నమ్మకాల నుంచి విద్యార్థులు బయటికి రావాలి
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థతోనే సమాజంలో అసమానతలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ, పీయూసీలో ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ చేశారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప పర్యవేక్షణలో ఎమ్మెల్యే రిజ్వాన్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ విద్యావంతులలోనూ కులప్రాధాన్యత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు మూఢ నమ్మకాల నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ చదివినవారు కూడా మూఢనమ్మకాలు పాటిస్తున్నారని, చదివినవారే ఇలా ఉంటే మార్పు ఎలా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దళిత సంఘర్ష సమితి రాష్ట్రంలో సారాయి అంగడి వద్దు - రెసిడెన్షియల్ స్కూల్ కావాలంటూ చేసిన ఉద్యమానికి అనుగుణంగానే తొలి బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమశాఖ ద్వారా రెసిడెన్షియల్ స్కూళ్లను పెంచామన్నారు. ప్రస్తుతం 946 స్కూళ్లు ఉన్నాయన్నారు. కొన్ని హోబళిలలో రెండు రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ విద్య అందించాలనేది తమ ఆశయమని పేర్కొన్నారు. గౌతమబుద్ధుడు, బసవణ్ణ శతాబ్దాల క్రితమే అందరూ సమానమని చాటారని గుర్తు చేశారు. వచ్చే ఏడాది నుంచి వందశాతం ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. క్రైస్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. విధాన పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి తదితరులు పాల్గొన్నారు.





ప్రముఖుల చిత్ర పటాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం

రెండో వికెట్ సిద్దరామయ్యే..

- ప్రతిపక్షనేత అశోక్ సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది పాలన ముగియగానే తొలి వికెట్‌గా వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187కోట్ల అవినీతిలో మంత్రి నాగేంద్ర రాజీనామా చేశారని, ఇక రెండో వికెట్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యే అని ప్రతిపక్షనేత అశోక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యారెంటీలు అమలు చేయడంతో ఖజానా ఖాళీ అయ్యిందన్నారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, సిద్దరామయ్య, డీకే శివకుమార్ కాంగ్రెస్ నుంచి నిధులు ఇవ్వడం లేదన్నారు. ప్రజల నుంచి భారీగా పిండుకునేందుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ద్విచక్రవాహనాన్ని శవం తరహాలో మోసుకెళ్లిన సిద్దరామయ్య ప్రస్తుతం ఎలా ధరలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో 20 సీట్లు గెలుస్తామని ధీమాలో ఉండేవారని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని విమర్శించారు. ఏడాది పాలనలో అభివృద్ధికి ఒకరూపాయి కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. ముద్దేబిహాళ్ ఎమ్మెల్యే నాడగౌడ అభివృద్ధి పనులు కుంటుపడిన విషయాన్ని బహిరంగంగా చెప్పారన్నారు. నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేకుండా పోతోందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాపోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులలోనూ అభివృద్ధి లేకుండా పోయిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో బొమ్మై ముఖ్యమంత్రిగా పదవిని కోల్పోయినప్పుడు రెవెన్యూలోటు లేదని, అప్పులు లేవన్నారు. సిద్దరామయ్య ఏడాదిపాలనలో అప్పులు పెరిగాయని ఆర్థిక పరిస్థితి అధ్వానం చేశారని అన్నారు. ఎందుకోసం పాలన సాగిస్తున్నారో అంటూ ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ పెంపుతో సామాన్యులపై భారం మోపారని మండిపడ్డారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.65	1,579.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	749	308
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,710	2200
సామర్థ్యం (టీఎంసీలు)	5.89	4.45

భద్రత కోసం బరువు తగ్గారు



అధిక బరువు తగ్గించుకున్న పోలీసు అధికారులు

బళ్లారి సిటీ, జూన్ 19: 21 రోజుల్లో అధిక బరువు గల పోలీసు అధికారులు, సిబ్బంది 4నుంచి 9కిలోల బరువు తగ్గారు. 'బళ్లారి భద్రత కోసం పటిష్టమైన పోలీసులు' అనే ప్రాజెక్ట్ కింద మే నుంచి జూన్ 18వరకు 21 రోజుల పాటు బిఎంఐ ఎక్కువగా ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40మందిని ఎంపిక చేయగా వారికి బళ్లారిలో వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. వారు రోజు ఉదయం పరుగు, నడక, యోగా, ఏరోబిక్స్, ధ్యానం, స్విమ్మింగ్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు మాట్లాడుతూ, శిక్షణలో భాగంగా వారు బళ్లారి, సండూర్ కొండలకు ట్రక్కింగ్ కూడా చేశారని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన జీవనశైలిని అనుసరించాలన్నారు. వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పుల గురించి వైద్యులు సమాచారం అందించి వారు రోజువారీ జీవితంలో పాటించాల్సిన ఆహారం గురించి తెలియజేశారన్నారు. చట్టపరమైన అవగాహన, ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారన్నారు.

550 రోజులుగా కొనసాగుతున్న దీక్షలు



కుడితిని వద్ద నిరసనదీక్ష చేస్తున్న రైతులు

కంప్లి, జూన్ 19 : కుడితిని పరిధిలోని కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకున్న రైతులు 550 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతున్నా ఇంతవరకు ఏ అధికారి తమ సమస్యలు వినడానికి రాలేదంటూ రైతు సంఘ నేతలు బసవరాజు, సత్తిబాబు, తిప్పేస్వామి, జంగ్లిసాబ్‌లు వాపోయారు. గతంలో వున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య తమకు న్యాయం చేకూర్చుతామని తెలిపి ఇంతవరకు తమకు న్యాయం చేకూర్చలేదన్నారు. బెల్గామ్‌లో శీతాకాల సమావేశాల్లో రైతులను మభ్యపెట్టేందుకే ఆయన తమతో చర్చించారన్నారు. కుడితిని, హరిగిణదోణి, జానెకుంటి, ఎర్రంగళి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపుర గ్రామాల రైతులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని తెలిపారు. వారితో పాటు లక్ష్మీ, భాగ్యమ్మ, పుష్పలత, నాగరాజు, రమేష్, తిమ్మప్ప, బావి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన



ధర్నా చేస్తున్నఅంగన్‌వాడీలు

కంప్లి, జూన్ 19 : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం బుధవారం తాలుకా పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి మాట్లాడుతూ కలబురిగి డివిజన్‌కు సంబంధించి ఈసీసీఈ జీవోను రద్దుచేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవోలో ఎన్నో లోపాలు వున్నాయని, వాటిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ధర్నాను విరమించబోమని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం కార్యదర్శి శకుంతల, కోశాధికారి ద్రాక్షాయణి, దుర్గాభవాని, రాజేశ్వరి, దేవీ బాయి, యల్లమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

సిరుగుప్ప, జూన్ 19 : విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగులుకుని షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగిన సంఘటన విజయనగర కాలనీలో చోటుచేసుకుంది. ఒకే స్తంభం నుంచి వెళుతున్న సుమారు 20 ఇళ్లకు చెందిన విద్యుత్ తీగలు తగులుకుని షార్ట్‌సర్క్యూట్ ఏర్పడింది. స్థానికులు మట్టి చల్లడంతో మంటలు ఆరిపోయాయి జెస్కమ్ లైన్‌మెన్‌లు కొత్త తీగలను ఏర్పాటు చేశారు.

మెటికలు విరచడంలో మేటి ఈ చిట్టి

కంప్లి, జూన్ 19 : ఓసీ! దీని జిమ్మడా! అంటూ గిట్టనివారిని తలుచుకుని మెటికలు విరవడం మనకు మామూలే. కానీ ఆ మెటికలు విరిచే పోటీలో చిన్న వయసులోనే పాల్గొని బళ్లారి జిల్లా కంప్లికి చెందిన కే.ప్రణవి అనే విద్యార్థిని ప్రపంచ రికార్డును సాధించింది. కేవలం 37 సెకన్లలోనే 50 సార్లు మెటికలు విరిచి పోటీలో తాను మేటి అని నిరూపించుకుంది. ఉత్కంఠభరితమైన ఈ ప్రదర్శనలో పాల్గొన్న ప్రణవి నైపుణ్యం, చురుకుదనంతో తన ప్రతిభ చాటుకుంది. వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో ఆమె పేరు నమోదయింది. ఈ విద్యార్థిని కంప్లి విద్యాసాగర పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. పాఠశాలకు పేరు తీసుకురావడంతో పాఠశాల వ్యవస్థాపకులు నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కిషోర్‌లు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా కుడితిని కమ్మసంఘం అధ్యక్షుడు రాము మాట్లాడుతూ చిన్నతనంలోనే ప్రణవి చదువుతో పాటు క్రీడాపోటీల్లో కూడా రాణించి తల్లిదండ్రులకు, పట్టణానికి పేరు తేవడం అభినందనీయమన్నారు.



ప్రపంచ రికార్డును కైవసం చేసుకున్న ప్రణవి

కార్పొరేటర్ల అభిప్రాయాలు సేకరణ

మేయర్ అభ్యర్థి ఎంపికపై ద్విసభ్య కమిటీ కసరత్తు

బళ్లారి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి మేయర్ అభ్యర్థి ఎంపికకు కాంగ్రెస్ నియమించిన ద్విసభ్యకమిటీ బుధవారం బళ్లారిలోని అల్లంభవన్‌లో సమావేశమైంది. ముందుగా ఎంపీ ఈ తుకారామ్, రాజ్యసభ ఎంపీ నాజిర్ హుస్సేన్, మాజీ మంత్రి బి నాగేంద్ర, బళ్లారి ఎమ్మెల్యే భరత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు అల్లం ప్రశాంత్‌లతో ముందుగా చర్చించింది. అనంతరం కాంగ్రెస్ కార్పొరేటర్లతో ఒక్కొక్కరితో విడివిడిగా వారి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిసింది.

కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం 26 మంది కార్పొరేటర్లలో ఇద్దరు మినహా మిగిలిన 24 మంది హాజరైనట్లు తెలిసింది. కార్పొరేటర్లను మేయర్ అభ్యర్థి విషయమై నేరుగా ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై కార్పొరేటర్లు వారి అభిప్రాయాలను కమిటీకు తెలిపినట్లు సమాచారం. మేయర్ పదవి కోసం నందీష్ బాబు, ప్రభంజన్ కుమార్, గాదెప్ప, విక్కి, ఆసిఫ్ ఐదుగురు పోటీలో వున్నారు. అభిప్రాయాల సేకరణ అనంతరం కేపీసీసీకి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. అర్ధరాత్రి వరకు ఈ అభిప్రాయ సేకరణ సాగింది.

బీజేపీ సభ్యుల సమావేశంలోనూ ఇదే చర్చ

మేయర్ ఎన్నికల నేపథ్యంలో గురువారం బీజేపీకి చెందిన 13 మంది కార్పొరేటర్లు మాజీ మేయర్ నివాసంలో సమావేశమయ్యారు. ఈ నెల 21న జరిగే మేయర్ ఎన్నికలకు పార్టీ పరంగా నామినేషన్లు వేసే విషయంపై చర్చించారు. మేయర్ కావడానికి కావాల్సిన కార్పొరేటర్ల సంఖ్య లేకున్నా ప్రతిపక్షంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. బీజేపీ నుండి మేయర్ స్థానానికి కోనంకి తిలక్, మోత్కుర్ శ్రీనివాసులు, ఇబ్రహీమ్ మొత్తం ముగ్గురు పోటీ చేసే అవకాశం వుంది.

సహకార సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక

కంప్లి, జూన్ 19 : కంప్లి పట్టణం ముద్దాపురం అగసి వద్దనున్న ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా కొల్లార మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా బళ్లారి బసవరాజులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రోహిణి మాలి తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ లేనందున వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సభ్యులు తమపై నమ్మకం వుంచి తమను ఎన్నుకున్నారన్నారు. సభ్యులు తమకు సహకరించినట్లయితే సంఘాన్ని పూర్తిగా అభివృద్ధి బాటలో నడిపిస్తామని తెలిపారు. ఎన్నికైన అధ్యక్ష ఉపాధ్యక్షులను పలువురు నాయకులు, సహకార సంఘం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఈరణ్ణ, భరత్ కుమార్, ప్రకాష్ కారేకల్, మురారి, డాక్టర్ వీఎల్ బాబు, సిద్దప్ప, కారేకల్ మనోహర్, బ్రహ్మయ్య, హనుమంతప్ప, నాగరాజు, బళే వీరేష్, సిరిగేరి రాజేష్, రమేష్, పార్వతి, ఈరప్ప, తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

తల్లీబిడ్డల మరణాలను నివారించాలి: డీసీ

బళ్లారి సిటీ, జూన్ 19: వైద్యులు సకాలంలో స్పందించి తగు చికిత్స అందించి తల్లీబిడ్డల మరణాలను నివారించాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. విజయనగర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రత్యేక వైద్యులు, వైద్యాధికారులు సిబ్బందితో మాతా శిశు మరణాలపై బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో గర్భిణులు బాలింతలు, శిశు మరణాలు జీరోకు వచ్చేలా తగు జాగ్రత్తలతో చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే మాత్రమే ఉన్నత స్థాయి ఆస్పత్రికి ముందస్తుగా సమాచారం అందించి అంబులెన్స్‌లో పంపించాలన్నారు. ఇంట్లోనే ప్రసవించడం తీవ్రమైన సమస్యలున్నప్పుడు తల్లిదండ్రులను విశ్వాసంలోకి తీసుకుని వారిని ఒప్పించాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం చేసుకునేందుకు వైద్యులకు అందుతున్న సౌకర్యాలపై కొత్తస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. మహిళ గర్భిణీ అని తెలిసిన రోజు నుంచి వచ్చే సాధారణ తీవ్రమైన సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది తగిన సలహాలు చికిత్స అందించాలన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు మింగడంతోపాటు రక్తపోటు మధుమేహం,హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని, స్కానింగ్ అవసరమైనప్పుడు వైద్యుల సలహా మేరకు చేసి పిల్లల ఆరోగ్యంలో లోపాలను ముందుగానే గర్తించి సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణాల రేటును జీరోకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డా.రమేశ్‌బాబు,జిల్లా సర్జన్ డా.బసారెడ్డి, డాక్టర్. విశ్వనాథ్,విమ్స్ వైద్యుడు వీరేంద్ర కుమార్,జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డా. హనుమంతప్ప, నిపుణులు, వైద్యాధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్నడీసీ ప్రశాంత్‌కుమార్

ఇంధన ధరల పెంపుపై జేడీఎస్ కన్నెర్ర

- గడిగిచెన్నప్ప సర్కిల్లో బైఠాయించి జేడీఎస్ నిరసన

బళ్లారి సిటీ, జూన్ 19: పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తూ బుధవారం జేడీఎస్ కార్యకర్తలు నగరంలో ఎడ్ల బండిపై ఊరేగింపును నిర్వహించారు. జేడీఎస్ జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు నగరంలోని గడిగిచెన్నప్ప సర్కిల్లో బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేద ప్రజల కడుపుకొట్టిందన్నారు. గత ఏడాది సరిపడా వర్షాలు లేకపోవడంతో ఇబ్బందుల్లో ఉన్న వారిని నిర్లక్ష్యం చేస్తే నిరసన స్వరూపం మారుతుందని హెచ్చరించారు. తదనంతరం సండూరు అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు సోమప్ప మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం చేరుకుని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీసీ ద్వారా గవర్నర్‌కు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు అద్దగేరి రామణ్ణ, అశోక్, శివరాయణ, వండ్రి.నాగరాజు, బసప్ప, ముత్తు, జమీల్, యశోద, నీలరేణుక, రహిమద్‌బీ, బాలసుబ్రమాణ్య చౌదరి, అంబన్న, ఖాజీ, హుస్సేన్‌బాషా, వన్నూర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



ఎండ్లబండిపై ఊరేగుతున్నజేడీఎస్ నాయకులు

ఏపీ సీఎంకు కమ్మసంఘం ప్రముఖుల సన్మానం



ఏపీ సీఎం చంద్రబాబును సన్మానిస్తున్న కమ్మసంఘం ప్రముఖులు

కంప్లి, జూన్ 19 : ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన నారా చంద్రబాబు నాయుడును విజయవాడలో అఖిల కర్ణాటక సంఘం ప్రముఖులు గారపాటి రామకృష్ణ, బళ్లారి కమ్మసంఘం ప్రముఖులు సత్తిబాబు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో రాక్షస పాలన పోయి దేవతా పాలన ప్రారంభమైందని, ఇకపై ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలకు, రైతులకు, మహిళా సంఘాలకు, ఇతరులకు అన్ని మంచిగా జరుగుతాయన్నారు. వారితో పాటు శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, రవి తదితరులు వున్నారు.

చిన్నారులకు అంగన్‌వాడీలలోనే విద్యాబోధన

కంప్లి, జూన్ 19 : నాలుగు సంవత్సరాలు నిండిన పిల్లలకు అంగన్‌వాడీలోనే ఎల్‌కేజీ, యూకేజీ బోధన చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కంప్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. 1974 నుంచి శిశుసంక్షేమ విభాగం కింద అంగన్‌వాడీ బడుల ద్వారా చిన్నారులకు విద్యాబోధన కల్పిస్తున్నామని,. కానీ ప్రభుత్వం ఉన్నపళంగా ప్రాథమిక పాఠశాలలోనే ఎల్‌కేజీ, యుకేజీ క్లాసులు ప్రారంభించడంతో తమకు ఇబ్బందిగా మారిందన్నారు. అంగన్‌వాడీలను తొలగించకుండా వారిని అలాగే కొనసాగించేలా ప్రభుత్వం చూడాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మంజుళ, ఉపాధ్యక్షురాలు అనురాధ, ఉమాదేవి, రాధాబాయి, ఉలిగమ్మ, నాగమ్మ, సరోజ, నజీరా, మంజుళ, సునీత, జయలక్ష్మీ, గిరిజ, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లీకూతుళ్ల అదృశ్యం

బళ్లారిరూరల్, జూన్ 19 : తాలుకాలోని టీ బూదేహాళ్ గ్రామానికి చెందిన హనుమంతప్ప భార్య ఆశ, కుమార్తె పూర్ణిమలు ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడంలేదని భర్త హనుమంతప్ప బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. చందూరు తాలుకా కురేకుప్ప గ్రామానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వారు ఇంతవరకు తిరిగి రాకపోవడంతో హనుమంతప్ప భార్య, కూతురు అదృశ్యంపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు..!



ప్రయాణీకుడికి డబ్బులను అప్పగిస్తున్న బస్ డ్రైవర్, కండక్టర్

రాయచూరు, జూన్ 19 : విధి నిర్వహణలో ఉన్న బస్ డ్రైవర్, కండక్టర్ తమ నిజాయితీని చాటుకున్న సంఘటన ఇది. వాయవ్య కర్ణాటక రవాణా సంస్థకు చెందిన హుబ్లీ డిపో బస్సు రెండురోజుల క్రితం హైదరాబాద్‌కు వెళుతుండగా, మాన్వి పట్టణంలో బస్సు ఎక్కిన ప్రయాణీకుడు తన బ్యాగ్‌ను మరచి రాయచూరులో దిగి వెళ్లాడు. హైదరాబాద్ చేరుకున్న అనంతరం బ్యాగ్‌ను గమనించిన బస్ డ్రైవర్ హనుమంత్రాయ, కండక్టర్ మంజునాథ దాన్ని తెరిచి చూడగా అందులో రూ.2.50 లక్షలతో పాటు అతని అడ్రస్ కనిపించింది. దీంతో ప్రయాణీకుడు చంద్రశేఖర్ పాటీల్‌ను బుధవారం నగరంలోని సెంట్రల్ బస్‌స్టాండ్‌కు రప్పించి స్థానిక బస్ స్టేషన్ అధికారి శ్రీశైల సమక్షంలో బ్యాగ్‌ను అందజేశారు. కాగా బ్యాగ్ యజమాని చంద్రశేఖర్ పాటీల్ డ్రైవర్, కండక్టర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ జీవితాంతం వారిని గుర్తించుకుంటానని వారు చేసిన సేవను ఎన్నటికి మరిచిపోలేనని భాగోద్వేగానికి గురయ్యాడు. కొద్దిపాటి డబ్బుల కోసం కక్కుర్తిపడి పలు రకాల తప్పుడు పనులు చేస్తున్న ఈ కాలంలో రూ.2.50 లక్షల నగదును ప్రయాణీకుడికి తిరిగి అప్పగించిన డ్రైవర్, కండక్టర్‌లను తోటి సిబ్బందితో పాటు అధికారులు ప్రశంసించి అభినందనలు తెలిపారు.

23న ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు

రాయచూరు, జూన్ 19 : నగరంలోని వీరశైవ కల్యాణ మండపంలో ఈ నెల 23న ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని గాణిగ సమాజం జిల్లా అధ్యక్షుడు చన్నప్ప సజ్జన్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్), పీయూసీలో ఎక్కువ మార్కులు పొందిన గాణిగ సమాజానికి చెందిన విద్యార్థులకు తమ సమాజం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఎన్.ఎస్.బోసరాజు, యాదగిరి సహాయ కమిసనర్ హంపణ్ణతో పాటు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్, సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటీల్, రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు. ప్రతి ఏటా తమ సమాజంలోని ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం ఆనవాయితిగా కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి మురుఘ మఠాధిపతి విజయేంద్ర స్వామి, స్థానిక కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య మహాస్వామిలు సానిధ్యం వహిస్తారన్నారు.

హోసూరు జోన్

సమగ్ర వ్యవసాయంపై శిక్షణ




సమగ్ర వ్యవసాయంపై శిక్షణలో పాల్గొన్న రైతులు

హోసూరు జూన్ 19: సమగ్ర వ్యవసాయంపై హోసూరు ప్రాంత రైతులకు రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణగిరి బాలసుబ్రహ్మణ్యం శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న రైతులకు సమగ్ర వ్యవసాయం ప్రాముఖ్యతను, దాని ద్వారా రైతులు ఎలా లాభం పొందవచ్చో వివరించారు. ఈ శిక్షణలో వ్యవసాయ విజ్ఞాన కేంద్రం వ్యవసాయ సాంకేతిక నిపుణుడు ఉదయన్ సేంద్రియ పద్దతిలో కలుపు నివారణ పోషకాహార నిర్వహణ సమీకృత తెగులు వ్యాధుల నిర్వహణ, సేంద్రియ వ్యవసాయ పద్దతిలో సాగు ప్రాముఖ్యత, సహజ ఎరువుల తయారీ గురించి చర్చించారు. దరఖాస్తు ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు వ్యవసాయ సహాయ సంచాలకులు భువనేశ్వరీ బయోఫెర్టిలైజర్లు, సూక్ష్మ పోషక ఎరువులు, సూడోమోనాస్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి పథకం, ప్రయోజనాలు, సబ్సిడీ వివరాలను రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారి హోసూరు రేణుక రైతులకు వేసిన ఎరువు ప్రాముఖ్యత, బిందు సేద్యం యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలపై రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారి రైతు శిక్షణా కేంద్రం, కృష్ణగిరి పిచ్‌లో విత్తన శుద్ది ప్రాముఖ్యత వేసవిలో సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు.

నీటి కోసం రాస్తారోకో

హోసూరు జూన్ 19: హోసూరు సానసంద్రం, దేవుడు నగర్, సీతారాం మేడు ప్రాంతాలకు సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని పేర్కొంటూ దీంతో ఆ ప్రాంత మహిళలు ఖాళీ బిందెలతో రింగ్ రోడ్డు ప్రాంతంలో రాస్తారోకోలో పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో 300కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ధర రూ700 వరకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెజారిటీ రోజువారీ వేతన జీవులు , వేతన కార్మికులు, దీంతో నీరు కొనలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్మికులు నిత్యావసరాలకు నీరులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సక్రమంగా తాగునీరు అందించాలంటూ రాస్తారోకోకు దిగారు. అనంతరం పట్టణ పోలీసులు, పైపుల ఇన్‌స్పెక్టర్ ఇళంగోవన్ నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



నీటి కోసం రాస్తారోకో చేస్తున్న స్థానికులు

21న పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై బీజేపీ నిరసన

రాయచూరు, జూన్ 19 : రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను విధించడాన్ని నిరశిస్తు తాము ఈ నెల 21న రాస్తారోకో చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పెట్రోల్,డీజిల్ ధరల పెరుగుదలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పైన, బీజేపీ పైన పలు సందర్భాల్లో ఆరోపణలు, విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకొచ్చేసరికి ధరలు పెంచడం దుర్మార్గమన్నారు.

రేణుకాస్వామి హంతకులను కఠినంగా శిక్షించాలి

- వీరశైవ జంగమ సమాజం డిమాండ్ ● నటుడు దర్శన్ దిష్టిబొమ్మ దహనం

రాయచూరు, జూన్ 19 : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామిని హత్య చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వీరశైవ జంగమ సమాజం నాయకులు డిమాండ్ చేశారు. రేణుకాస్వామిని హత్యను నిరశిస్తు వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం లింగసుగూరు పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు నటుడు దర్శన్ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు ఇటీవల జరిగిన స్నేహ హిరేమఠ హత్యను మరువక ముందే రేణుకాస్వామిని హత్య చేయడం రాష్ట్రంలో వీరశైవ జంగమ సమాజానికి ఎదురవుతున్న ముప్పును తెలియజేస్తున్నదన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నిందితులను శిక్షించాలని రేణుకాస్వామి కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. చిత్రదుర్గలోని అపోలో ఆస్పత్రిలో పని చేస్తున్న రేణుకాస్వామి బెంగళూరులో మృతుడిగా పడి ఉండడం పలు అనుమానాలకు తావిచ్చిందన్నారు. దుండగులు ఆయనను దారుణంగా హత్య చేసి పారవేసి వెళ్లారని దీనిపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కేసు పుర్వాపరాలు : కన్నడ యాక్టర్ పవిత్ర గౌడ మొబైల్‌కు చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అసభ్యకరమైన సందేశాలు పంపడం ప్రారంభించాడు. పవిత్ర గౌడ రేణుకాస్వామి నెంబర్‌ను బ్లాక్ చేసినా కొత్త నెంబర్ నుంచి మెసేజ్‌లు పంపేవాడు. ఇలాంటి టార్చర్ భరించలేనని పవిత్ర గౌడ తన ఇంటి పనిమనిషి పవన్‌కు విషయం చెప్పింది. ఈ విషయాన్ని పవన్ సినీ నటుడు దర్శన్‌కు చెప్పాడు. దీంతో చిత్రదుర్గ నుంచి రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి బెంగళూరులోని ఒక షెడ్డులో ఉంచి సినీ నటుడు దర్శన్ ఆయన అనుచరులు ఆయనను విపరీతంగా కొట్టడంతో రేణుకాస్వామి మృతిచెందాడని తెలుస్తోంది. అనంతరం దర్శన్ ఆదేశాల మేరకు మరో ఐదుగురు కిరాయిమనుషులు మృతదేహాన్ని తీసుకెళ్లి డ్రైనేజి కాల్వలో పడేశారు. పోలీసులు నటుడు దర్శన్‌తో పాటు అతని అనుచరులైన మరో 17 మందిని అరెస్టు చేశారు.



రేణుకాస్వామి (ఫైల్)

రాస్తారోకో చేపట్టిన అంగన్‌వాడీలు

రాయచూరు, జూన్ 19 : అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభించాలన్న డిమాండ్‌తో ఆందోళన బాట పట్టిన అంగన్‌వాడీలు బుధవారం నగరంలోని వాల్మీకి సర్కిల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. గతంలో యూనియన్ నిర్ణయించిన మేరకు అంగన్‌వాడీలు మంత్రి ఎన్.ఎస్ బోసరాజు ఇంటి ముట్టడి ఆందోళన నిర్వహించాల్సి ఉండగా పోలీసులు అక్కడ అనుమతించకపోవడంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలు నగరంలోని వాల్మీకి సర్కిల్ ప్రధాన రహదారి పై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కాగా ప్రభుత్వ పాఠశాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అంగన్‌వాడీలు తీవ్రంగా వ్యతిరేకించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చందాల కేశవదాసు (జయంతి)



చందాల కేశవదాసు 1876 జూన్ 20న ఖమ్మం జిల్లా జక్కేపల్లిలో జన్మించారు. తొలి తెలుగు నాటకకర్త, తొలి సినీ గేయ రచయిత, కవి, నటుడు, గాయకుడు, హరికథా కళా కారుడు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో పాడే 'పరబ్రహ్మ పరమేశ్వర' అనే గొప్ప కీర్తనను, ఆంధ్రదేశమంతటా ఉర్రూతలూగించిన 'భలే మంచి చౌకబేరము పోయినన్ దొరకదు...' అనే పాటను రాసింది ఆయనే. తెలుగులో మొదటి శబ్ద చిత్రం 'భక్తప్రహ్లాద'కు పాటలు రాసి 'తొలి తెలుగు సినిమా పాటల రచయిత'గాను, తెలంగాణ హరికథా పితామహుడిగాను గుర్తింపు పొందారు. 1956 మే 14న కన్నుమూశారు.

గోర్డోన్ విలియమ్స్ (జయంతి)



బుకర్ ప్రైజ్ గ్రహీత గోర్డోన్ మాక్లీన్ విలియమ్స్ 1934 జూన్ 20న స్కాట్ల్యాండ్ దేశం పైస్లీ పట్టణంలో జన్మించారు. బుల్లితెరకు పలు రచనలు అందించడంతోపాటు 20కు పైగా నవలలు రచించారు. 'ఫ్రం సీన్స్ లైక్ దిస్' నవల ఎంతో పేరొందింది. అంతే కాక ఫుట్బాల్ క్రీడాకారుల అసోసియేషన్కు చెందిన బాబీ మూర్, టెర్రీ వెనబల్స్ జీవితచరిత్రలు రాసి ఘోస్ట్ రైటర్గా పేరొందారు. 2017 ఆగస్టు 20న కన్నుమూశారు.

విక్రమ్ సేథ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత విక్రమ్ సేథ్ 1952 జూన్ 20న కోల్కత్తాలో జన్మించారు. లెక్కకు మిక్కిలి నవలలు రాశారు. కవిగా రాణించారు. ఎ సూటబుల్ బాయ్, ది గోల్డెన్ గేట్, ఆన్ ఈక్వల్ మ్యూజిక్ తదితర రచనలు పేరొందాయి. సాహిత్య అకాడమీ అవార్డు, ప్రవాసి భారతీయ సమ్మాన్, డబ్ల్యు హెచ్ స్మిత్ లిటరరీ అవార్డు, క్రాస్వర్డ్ బుక్ అవార్డు, కామన్వెల్త్ రైటర్స్ ప్రైజ్ తదితర అవార్డులు అందుకున్నారు. 'ది రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్'లోనూ గుర్తింపు పొందారు. 2001లో కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ గుర్తింపు సాధించారు.

చెన్నపట్టణ ఆలయాల సందర్శన





వేర్వేరు ఆలయాల్లో విశేష పూజల్లో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్సభ నియోజకవర్గ పరిధిలోని చెన్నపట్టణలో డీసీఎం డీకే శివకుమార్ టెంపుల్రన్ చేపట్టారు. లోక్సభ ఎన్నికల్లో తమ్ముడు డీకే సురేశ్ ఓటమి తర్వాత ఒక రోజంతా పూర్తిగా చెన్నపట్టణ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని 14 ఆలయాలను బుధవారం సందర్శించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి దాకా సుడిగాలిలా తిరిగారు. హొంగనూరు జిల్లా పంచాయతీ కెంగల్లోని హనుమంతరాయస్వామి దేవస్థానం, నీలకంఠేశ్వర దేవస్థానం, చెన్నపట్టణలోని కోటె టౌన్ కాళమ్మ ఆలయం, వరదరాయస్వామి ఆలయం, దొడ్డమలూరులోని అప్రమేయస్వామి ఆలయం, దేవలహళ్ళిలోని బీరేశ్వర ఆలయం, గౌడగెరెలోని చాముండేశ్వరి ఆలయం, దేవరహొసహళ్ళిలోని సంజీవరాయస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, హౌసింగ్బోర్డులోని మహదేశ్వర ఆలయం, బీవీపాళ్యలోని ధర్మరాయస్వామి ఆలయం, హుణసనహళ్ళిలో బిసళమ్మ దేవస్థానం, నెరళూరులో వైద్యనాథేశ్వర ఆలయం, కొరనగెరె బెట్టలో యోగ నరసింహస్వామి ఆలయం, కుడ్లూరులో రామమందిరాన్ని సందర్శించారు. ఏకంగా 14 ఆలయాలను డీసీఎం సందర్శించారు. చెన్నపట్టణ తాలూకా కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. ఇదే సందర్భంగా కొద్దిసేపు స్థానికుల సమస్యలను ఆలకించారు.

కెంపేగౌడ జయంతిపై సన్నాహకసభ



సమావేశంలో తహసీల్దార్ స్వామి తదితరులు

శిడ్లఘట్ట, జూన్ 19: నాడప్రభు కెంపేగౌడ జయంతి నిర్వహణకు సంబంధించి జాతీయపండుగల ఆచరణ సమితి అధ్యక్షుడు తహసీల్దార్ బీఎస్ స్వామి ప్రత్యేక సన్నాహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉత్తమ జీవనం సాధ్యమని ఇందుకు వర్గాలకు అతీతంగా తమ పిల్లలను చక్కగా చదివించాలన్నారు. నాడప్రభు తన దూరదృష్టితో బెంగళూరు మహానగరాన్ని తీర్చిదిద్దారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించారన్నారు. ఆయన పేరిట ప్రతిభా పురస్కారాలు, కెంపేగౌడ జయంతి రోజున స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఒక్కలిగ సంఘం తాలూకా అధ్యక్షుడు బి నారాయణస్వామి మాట్లాడుతూ కరువు నేపథ్యంలో కెంపేగౌడ జయంతి సరళంగా ఆచరించనున్నట్టు తెలిపారు. మూడేళ్లకోసారి ఘనంగా నిర్వహించదలిచేలా తీర్మానించామన్నారు. అన్నివర్గాల ప్రతిభావంత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ఈనెల 27న నిర్వహించే కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వెంకటస్వామి, హెచ్కె సురేశ్ తదితరులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి కేంద్రం ఏర్పాటు



అభివృద్ధి కేంద్రం ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చాణక్య విశ్వవిద్యాలయంలో వివిధ ఉద్దేశ్యాలకోసం సుస్థిర అభివృద్ధి కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. క్రియాశీలకంగా వ్యవహరించడం, పరిశోధనలు, విద్య, ప్రకృతి, సామాజిక సవాళ్లను అధిగమించడం ఈకేంద్ర ఉద్దేశ్యంగా ఉంది. దేశ ప్రముఖ ఆర్థికనిపుణుడిగా పేరొందిన 'చాణక్య' స్ఫూర్తి సమాజంలో సమగ్ర అభివృద్ధికి బాటలు కావాలని ఆకాంక్షించారు. భారతీయ జ్ఞానపరంపర, ఆధునిక, సైన్స్ అండ్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం తదితర అంశాలపై ఈ కేంద్రం దృష్టి సారించనుందని ప్రశాంత్ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. పద్మశ్రీ గ్రహీత ప్రొఫెసర్ ఎంకే శ్రీదర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుస్థిర భవిష్యత్తుకోసం సమగ్ర పరిశోధనలు, పరిష్కారాలకోసం ఈ కేంద్రం ఉద్దేశించబడినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిఖిల్కామ్, బీఐఎల్ ఎండీ శ్రీహరిమారర్, ప్రొఫెసర్ సుబ్బణ్ణ అయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు.

వారపుసంతలో పూలు, పండ్ల విక్రయాలపై పన్ను వద్దు



పీడీఓకు వినతి పత్రం ఇస్తున్న రైతుసంఘం పదాధికారులు

శిడ్లఘట్ట, జూన్ 19: తాలూకాలోని గుంబిగానహళ్ళి (హెచ్క్రాస్)లో వారపు సంతలో రైతులు విక్రయించే పూలు, పండ్లు, కూరగాయల మూటలపై సుంకం విధించడాన్ని హసిరుసేన రైతుసంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. రైతుసంఘం సభ్యులు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏటా వారపు సంతలో సుంకం వసూలుకోసం వేలం నిర్వహించే అంశంపై గ్రామపంచాయతీ ద్వారా కరపత్రాలు ముద్రించి ప్రచారం చేయడంతో బహిరంగమైంది. దీనిపై హసిరుసేన రైతుసంఘం చంద్రశేఖర్ వర్గీయులు గ్రామపంచాయతీ ఆవరణలో నిరసన తెలిపారు. రైతులు పండించి విక్రయించే పండ్లు, పూల విక్రయాలకు వారపుసంతలో సుంకం విధించరాదని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఏపీఎంసీ చట్టాల ప్రకారం ముందుకు సాగాలన్నారు. పీడీఓ ఎంసీ ప్రశాంత్కుమార్ మాట్లాడుతూ ఏటా వారపుసంతకు సంబంధించి గత ఏడాది ఎలాంటి సుంకం వసూలు చేయలేదని ప్రస్తుతం గ్రామపంచాయతీ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి తీర్మానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు మునినంజప్ప, జంగమకోటె హోబళి అధ్యక్షుడు దేవరాజ్, బీరప్ప, సురేఖా, సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

గ్లెనిగల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో

5జీ అంబులెన్స్ సేవలు ప్రారంభం



అంబులెన్స్ సేవలకు జెండా

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అత్యవసర వేళ సేవలు అందించే అంబులెన్స్ సేవలలో అత్యాధునిక ఫీచర్లు కలిగిన 5జీ ఎనేబుల్డ్ సర్వీస్ అంబులెన్స్లను గ్లెనిగల్ ఆసుపత్రిచే లాంఛనంగా ఆవిష్కరించారు. కొత్త అంబులెన్స్లలో అడ్వాన్స్ లైఫ్ సపోర్టర్, జియో నెట్వర్క్ ద్వారా వేగవంతంగా సమాచారం చేరవేయడం, ద్విముఖ ఆడియో, వీడియో సందేశాలు, హెచ్డీ కెమెరాలతో పాటు స్మార్ట్ సాధనాలు ఉన్నట్లు ప్రకటించారు. బీజీఎస్, ఎస్జేబీ సంస్థల ఎండీ ప్రకాశనాథ స్వామీ, ఐజీపీ డాక్టర్ బీఆర్ రవికాంతేగౌడ, డీసీపీ అనితా హెద్దణ్ణనవర్, గ్లెనిగల్ హెల్త్కేర్ సీఈఓ బిజునాయర్, మెడ్యులెన్స్ కోఫౌండర్లు ప్రణవ్ బజాజ్, రావ్జీత్ సింగ్ అరోరాలు పాల్గొన్నారు. మెడ్యులెన్స్ కో ఫౌండర్ ప్రణవ్బజాజ్ మాట్లాడుతూ అత్యవసర వైద్యవిధానంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలని 5జీ ఎనేబుల్డ్ సర్వీస్ అంబులెన్స్లను సిద్ధం చేశామన్నారు. అత్యాధునిక సాంకేతిక విధానాలు అనుసంధానం చేశామని అత్యవసర రోగులకు చికిత్సలు అందించేందుకు తక్కువ సమయంలోనే ఎక్కువ సౌలభ్యాలు అంబులెన్స్లు సమకూరుస్తామన్నారు. వైద్యరంగంలో సుస్థిర సాంకేతిక విధానాలు తీసుకొచ్చామన్నారు. గ్లెనిగల్ ఆసుపత్రికి తొలుత అంబులెన్స్లు సమకూర్చామన్నారు.

వెరికోస్ వెయిన్స్ పట్ల నిర్లక్ష్యం సరికాదు

బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెరికోస్ వెయిన్స్ ఇటీవల సాధారణంగా మారిపోతోం దని బాధితులు నిర్లక్ష్యం చేయడం సరికాదని అపోలో ఆసుపత్రి వ్యాస్కులర్ సర్జన్ వినయ్ న్యాపతి అభిప్రాయపడ్డారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాళ్లలో నరాలు ఉబ్బుగా వచ్చే జబ్బునే వెరికోస్ వెయిన్స్గా పిలుస్తారు. నరాలు ఉబ్బడంతో పాటు తిరిగినట్లుగా మారుతుండటంతో కవాటాల నుంచి రక్తస్రావం కావడం లేదా తీవ్రమైన నొప్పి రావడం జరుగుతుందన్నారు. 20శాతం వయస్సు పైబడిన వారికి, మహిళల పైనా ప్రభావం ఎక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు. వంశపారంపర్యత, స్థూలకాయం, దీర్ఘకాలం నిలబడి ఉండే పనులు, గర్భధారణతో పాటు పలు కారణాలతో వెరికోస్వీన్స్ వస్తుందన్నారు. వీటి ద్వారా కాళ్ల నొప్పులు, ఆయాసంతో ఇబ్బంది, నరాలు నల్లగా మారడం వంటి లక్షణాలు ఉంటాయని నిర్లక్ష్యం చేస్తే చర్మకేన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు వెరికోస్ వేన్స్ నిర్వహణలో ఆపరేషన్లు లేకుండానే చికిత్సా విధానాలు పెరుగు తున్నాయన్నారు. 20-30 నిమిషాలలలోనే డేకేర్ చికిత్సల ద్వారా నయం చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. సంప్రదాయ విధానాల ద్వారా కాకుండా అడ్హెసివ్ ఆధారంగా థెరపీకు థర్మల్ శక్తి, సర్జరీ లేకుండానే నయం చేసే విధానం ఉందన్నారు. వెరికోస్ ద్వారా వెంటనే తీవ్ర ప్రభావం రాకున్నా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

శ్మశానాన్ని కాపాడుతాం : తహసీల్దార్



గ్రామస్థుల అభిప్రాయాలు ఆలకిస్తున్న తహసీల్దార్ రశ్మి

బంగారపేట, జూన్ 19: ఆక్రమణలకు గురైన స్మశానాన్ని కాపాడుతామని తహసీల్దార్ రశ్మి హామీ ఇచ్చారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారని సక్కనహళ్ళి గ్రామంలో స్మశానాన్ని మహేశ్రెడ్డి అనే వ్యక్తి పేరిట నకిలీ ఖాతాకు సిద్ధమయ్యారని గ్రామపంచాయతీ సభ్యుడు కుపేంద్ర ఫిర్యాదు నేపథ్యంలో తహసీల్దార్ రష్మి బుధవారం గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే 19లో పౌతిఖాతాకు సంబంధించి అర్జీ సమర్పించారని, మరికొందరు అభ్యంతరం తెలపడంతో వాస్తవాల పరిశీలనకు వచ్చినట్టు తెలిపారు. కొన్ని సర్వే నెంబర్లలో స్మశానం, చెరువు ప్రదేశాలు ఉన్నాయన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించినా, ప్రభుత్వ ఆస్తుల కబ్జాకు యత్నించినా సహించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్థుల సమస్యలు, అభిప్రాయాలు ఆలకించారు.

ఎస్ఎస్ఎల్సీ విద్యార్థి అరెస్ట్

- పిన్నిపై అత్యాచార యత్నం
- వ్యతిరేకించినందుకు హత్య

బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పిన్నిపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో హత్య చేశాడు. ఈ సంఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకాలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. ఈనెల 16న బిళియూరు ఇంట్లో హేమావతి (37) హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. అక్కచెల్లెళ్ల మధ్య అన్యోన్యమైన సంబంధం ఉంటుంది. ఇరువురి పిల్లలను తల్లిగా ఆదరిస్తారు. ఇలా పదో తరగతి చదివే అక్క కుమారుడిని ఇంట్లోనే ఉంచుకుని బడికి పంపిస్తున్నారు. 16న రాత్రి పిన్నిపట్ల అనుచితంగా ప్రవర్తించేందుకు సిద్ధమయ్యాడు. తీవ్రంగా మందలించింది. అయితే కుటుంబ సభ్యులను నిద్ర లేపకుండానే ఆమె గదికి వెళ్లారు. తెల్లారితే పిన్ని తన గురించి అందరికీ చెబుతుందని భయపడి ఆమె నిద్రిస్తున్న గదికి వెళ్లి గొంతునులిమి చంపేశాడు. పొద్దునే ఎంతసేపటికి హేమావతి లేకపోవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. దారుణానికి పాల్పడిన బాలుడు గుండెపోటుతో మరణించి ఉంటారని నమ్మించే ప్రయత్నం చేశాడు. అంత్యక్రియలు జరుపుదామని కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోస్టుమార్టం జరిపించగా గొంతునులిమి హత్య చేసినట్టు నిర్ధారణ అయ్యింది. పోలీసుల విచారణలో పదో తరగతి చదివే అక్క కుమారుడు దారుణానికి పాల్పడినట్టు తేలింది. హేమావతి భర్త విఠలపై ఫిర్యాదు మేరకు ఉప్పినంగడి పోలీసులు అత్యాచారయత్నం, హత్య కేసు నమోదు చేశారు. సదరు విద్యార్థిని బుధవారం అరెస్టు చేశారు.

లారీ దోపిడీ.. ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

చింతామణి, జూన్ 19: లారీని అడ్డగించి క్యాబిన్లోకి చొరబడి డ్రైవర్ను బెదిరించి రూ.2,500 దోపిడీ చేసి పారిపోయిన నిందితులలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 15న చింతామణి రూరల్ పోలీసులు ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. నిందితులలలో ఒకరు చింతామణి శాంతినగర్ సమీపంలోని నల్లగుట్టకు చెందిన సుబ్రహ్మణి, తాలూకాలోని మల్లికాపురకు చెందిన శివకుమార్, బెంగళూరు కుందలహళ్ళికి చెందిన శివకుమార్గా గుర్తించారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈనెల 14న మఠంపల్లి సిమెంటు ఫ్యాక్టరీనుంచి వినుకొండ, మైదుకూరు, రాయచోటి, మదనపల్లి మీదుగా బెంగళూరుకు బయల్దేరిన లారీని దుండగులు అడ్డుకున్నారు. డ్రైవర్ను బెదరించి అతడి వద్ద ఉన్న నగదును లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎట్టకేలకు ముగ్గురిని అరెస్టు చేసి మరో వ్యక్తికోసం గాలింపులు చేపట్టారు.

మూడేళ్ల బాలుడిని హతమార్చిన చిన్నాన్న

చింతామణి, జూన్ 19: సమాజంలో కొన్నిఘటనలు మానవ సంబంధాలపట్ల విలువలు కోల్పోతున్నాయి. తాలూకాలోని మురగమల్లా హోబళి నిమ్మకాయలహళ్ళిలో చిన్నారిని సొంత చిన్నాన్న హతమార్చిన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శిరీషా, మంజునాథ్ దంపతులకు మూడేళ్ల గౌతమ్ ఉన్నాడు. ఇంటిపక్కనే ఉన్న చిన్నాన్న రంజిత్కుమార్ యాక్సిల్బ్లేడ్తో గౌతమ్ గొంతుకోసి హతమార్చాడు. ఘటనకు కారణాలు తెలియరాలేదు. రంజిత్కుమార్ ఇంజనీరింగ్ చేసినా గ్రామంలో ఒంటరిగా ఉంటూ ఎవరితోనూ చేరేవాడు కాదు. అయితే ఇతను ఎందుకిలా చేశాడనేది అర్థం కాలేదు. ప్రస్తుతం పరారీలో ఉన్న రంజిత్ కుమార్కోసం పోలీసులు గాలింపులు చేపట్టారు. సమాచారం అందుకున్న డీఎస్పీ మురళీధర్, కెంచార్లహళ్ళి పోలీస్ ఇన్స్పెక్టర్ వెంకటరవణప్పలు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిక్కబళ్ళాపుర జిల్లా ఎస్పీ డిఎల్ నాగేశ్ కూడా నిమ్మకాయలహళ్ళి గ్రామాన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు.

నోరు మెదపకుండానే..

వచ్చారు.. చెప్పింది విన్నారు.. వెళ్లారు..

రైతులతో మాట మాట్లాడని కరువు బృందం

హిందూపురం, జూన్ 19: రబీలో పంటలు నష్టపోయిన రైతుల బాధలు కళ్లారా చూడటానికి వచ్చిన కేంద్ర కరువు బృందం సభ్యులు కనీసం మాట మాటాడకపోవడం గమనార్హం. రొద్దం మండలంలోని ఆర్.కొట్టాల చెరుకూరులో రైతులతో వారు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును కేంద్ర బృందం వద్ద విన్నవించుకున్నారు. కేంద్ర బృందం సభ్యులు మాత్రం రైతులు చెప్పిన దానిని రాసుకుని వెళ్లారు తప్ప.. నోరు విప్పి మాట మాట్లాడింది లేదు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రబీలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని రైతులకు సూచించారు. రైతులు మాట్లాడుతూ.. మండలంలో పప్పుశనగ సాగు చేశామనీ, ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పెట్టామనీ, అది కూడా చేతికి అందలేదని వాపోయారు. మొదట కొట్టాల గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ, తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. మండలంలో పాడిరైతులు అధికంగా ఉన్నారనీ, ప్రభుత్వ డెయిరీ లేక గిట్టుబాటు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర దక్కక వ్యవసాయమే వద్దనుకునే పరిస్థితికి రైతన్నలు వచ్చారన్నారు. రైతు రైతుగా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ డెయిరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయినపుడు రైతన్నలు పూర్తిస్థాయిలో ఆదుకోవాలనీ, లేదంటే ఆ రైతన్న మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతాడన్నారు. ప్రతిసారీ కేంద్ర బృందం వస్తుంది, వెళ్తుంది తప్ప.. రైతులకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని, రైతులను ఆదుకోవాలన్నారు. రబీ సీజన్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వాటిల్లిన పంటనష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందంలోని సభ్యులు మాట్లాడుతూ.. రైతులు చెప్పిన విషయాలన్నీ కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండలంలో 656 హెక్టార్లలో పప్పుశనగ పంట నష్టంపై నివేదిక రూపంలో వ్యవసాయాధికారులు సమర్పించారు. రొద్దం మండలం నుంచి 503 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీ మంజూరవుతుందని తెలిపారు. కేంద్ర బృందంలో కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి, సీఈఓ రితేష్చౌహాన్, హైదరాబాద్ డీటీఈ, ఆయిల్సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామి, ఢిల్లీకి చెందిన వ్యవసాయశాఖ ఫార్మర్స్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్దూబే, రాష్ట్ర విపత్తు సంస్థల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్కు భూములిచ్చిన రైతులతో ముఖాముఖి



మాట్లాడుతున్న కలెక్టర్ శుభకల్యాణి

పావగడ, జూన్ 19 : తాలూకా పరిధిలోని ర్యాప్టా గ్రామ పంచాయతీలో బుధవారం సోలార్ విద్యుత్ ఉత్పాదనకు భూములిచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. కర్ణాటక సోలార్ పవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు భూముల ధరల పెంపకంపై నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో తుమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణి పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే వివిధ సోలార్ కంపెనీల నుంచి 2600మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రపంచ దేశాలకు అందిస్తోంది. దేశంలో విద్యుత్ అందించేందుకు 4336 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ఉత్పాదనకు భూములు అందించి రైతులు సహకరించాలని ఆమె కోరారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప మాట్లాడు తూ.. కంపెనీ ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.25,200 అందజేస్తుందని తెలిపారు. ఇది నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.

జూలైలో భద్ర నీటి విడుదల

భద్ర నీటిని వచ్చే జూలై నెలలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతులమీదుగా విడుదల చేసి పావగడ తాలూకాలోని ప్రతి పల్లెకు అందజేస్తానని ఎమ్మెల్యే హెచ్వీ వెంకటేశ్ తెలిపారు. ఆయన బుధవారం తిరుమణిలో రూ.76 లక్షల అంచనాతో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం, రూ.29లక్షలతో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. తాలూకాలోని ప్రతి గ్రామానికి సీసీరోడ్లు నిర్మించడానికి రూ.7కోట్ల నిధులు ఇప్పటికే సీఎం మంజూరు చేశారని ఈ యేడాది లోగా పనులకు శ్రీకారం చుడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాని, పంచాయతీ అధ్యక్షుడు లోకేష్, తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరాం తదితరులు పాల్గొన్నారు.



కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు. నగరంలోని ఫ్రీడంపార్కులో భారీ సంఖ్యలో చేరిన అంగన్వాడీ కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. అంగన్వాడీ కేంద్రాల మనుగడకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్కేజీ అమలు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్లు, సహాయకుల మనుగడకు వీలుగా ప్రభుత్వం వ్యవహరించాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఉంటూ ఒక శాఖ బలోపేతానికి మరోశాఖను నిర్వీర్యం చేసేయత్నం సరికాదని ఆక్రోశం వ్యక్తం చేశారు. వేలాదిమంది అంగన్వాడీ కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి, బెంగళూరు